క్లుప్తంగా

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్‌లోని ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరేకృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

బంగారయ్య మృతికి సంతాపం

తగరపువలస: భీమిలి మండలం బోడమెట్టపాలెం పంచాయతీకి చెందిన సీపీఎం, సీఐటీయూ నాయకుడు ముద్దాడ బంగారయ్య (85) ఆదివారం మధ్యాహ్నం తన స్వగ్రామం దాకమర్రిలో మృతి చెందారు. గత ఎంపీటీసీ ఎన్నికల్లో దాకమర్రి నుంచి పోటీ చేసి 800 ఓట్లు సాధించి ఓటమి చెందారు. ఈయన భౌతికకాయానికి ఆర్.ఎస్.ఎన్.మూర్తి, రవ్వ నరసింగరావు, ఎస్.అప్పలనాయుడు, దుంప అప్పలనాయుడు, పిన్నింటి సూర్యనారాయణ, దుంప అప్పలనాయుడు, భాగం లక్ష్మి, ముగడ ఈశ్వరరావు తదితరులు నివాళులర్పించారు.

తగరపువలస మెయిన్‌రోడ్డులో అంధకారం


తగరపువలస: స్థానిక మెయిన్‌రోడ్డులోని ఎన్టీఆర్ విగ్రహం నుంచి తాతా థియేటర్ వరకు విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో అంధకారం నెలకొంది. దీంతో ఈ మార్గంలో చీకటి పడిన తర్వాత చిన్న చిన్న రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. అసలే ఇక్కడి మెయిన్ రోడ్డుకు ఇరువైపులా చిరు వ్యాపారులు సగం రహదారిని ఆక్రమించుకుని దుకాణాలు, తోపుడు బండ్లు ఏర్పాటు చేసుకోవడంతో మార్గం ఇరుకుగా మారిపోయింది. జీవీఎంసీ అధికారులు స్పందించి మెయిన్ రోడ్డులో విద్యుత్ దీపాలు పునరుద్ధరించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

రోగులకు మందుల పంపిణీ


శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

భీమునిపట్నం: స్థానిక కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి పర్యవేక్షణలో ఉచిత హోమియో వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు టి.జగన్నాథరావు, టి.జె.మోహన్ 95 మంది రోగులను పరీక్షించి అవసరమైన వారికి మందులు అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు కె.ఎస్.ఎన్.మూర్తి, కె.చంద్రశేఖర్, కె.భానోజీరావు, కె.శ్రీనివాసరావు, సభ్యులు వి.లక్ష్మణరావు, రాంబాబు, ఎం.శంకర్, గంధ రాము, సాయి, దివ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్ల అందజేత


సర్టిఫికెట్లు అందిస్తున్న ప్రతినిధులు

తగరపువలస: భీమిలి ఆదర్శ హిందీ ప్రేమీ మండలి ఆధ్వర్యంలో హయ్యర్ విద్యార్థులకు ఆదివారం సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. అనంతరం సెప్టెంబర్ 9, 10న భీమిలి కేంద్రంగా లోయర్, హయ్యర్ పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు, గౌరవ అధ్యక్షుడు గంటా నూకరాజు పాల్గొన్నారు.

ఆత్మీయ నేస్తాల అపూర్వ కలయిక

35 ఏళ్ల తర్వాత కలుసుకున్న చంద్రంపాలెం హైస్కూల్ విద్యార్థులు


చంద్రంపాలెం హైస్కూల్ ప్రథమ హెచ్ఎం సుబ్బారావును సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు


అప్పటి ఉపాధ్యాయురాలిని సత్కరిస్తున్న చంద్రంపాలెం హైస్కూల్ 1987 - 88 బ్యాచ్ విద్యార్థులు

మధురవాడ: సుదీర్ఘ విరామం తర్వాత ఆత్మీయ నేస్తాలు కలుసుకున్నారు. తమ బాల్య స్మృతులను నెమరువేసుకుని ఆనందంతో పరవశించిపోయారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించుకుని గురుభక్తిని, సంస్కారాన్ని చాటుకున్నారు. ఈ ఆత్మీయ వేడుకకు చంద్రంపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ వేదికైంది. ఇక్కడ 35 ఏళ్ల కిందట (1987 – 88) పదో తరగతి చదువుకున్న విద్యార్థులంతా ఆదివారం కలుసుకున్నారు. వేర్వేరు ప్రాంతాల్లో ఉద్యోగాలు, వ్యాపారాలు, రాజకీయ రంగాల్లో స్థిరపడిన వారు, ఇదే పాఠశాలలో అభివృద్ధి కమిటీ సభ్యులుగా, ఇతర వ్యవహారాల్లో చురుగ్గా పాల్గొంటున్న వారంతా కుటుంబ సభ్యులతో కలుసుకుని ఒక్కొక్కరి యోగ క్షేమాలు తెలుసుకున్నారు. హైస్కూల్ ఏర్పడినప్పటి తొలి ప్రధానోపాధ్యాయులు యం.శ్యామల సుబ్బారావు, తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులు కేవీఎస్ఎస్ శర్మ, ఆరవెల్లి బుచ్చిబాబు, కేవీ రమణమూర్తి, జె.ఆనంద్, యం.విజయలక్ష్మి, సుహాసిని, ప్రస్తుత హెచ్ఎం ఎం.రాజబాబును ఘనంగా సన్మానించారు. అందరూ ఆనందంతో సందడి చేశారు. ఈ ఆత్మీయ కలయికలో పిళ్లా కృష్ణమూర్తిపాత్రుడు, పిళ్లా సూరిబాబు, పోతిన శివలింగేశ్వరరావు, టీఎస్ఎస్ రాజు, పోతిన రాము, వానపల్లి ముత్యాలరావు, మంతెన పార్వతి, పోతిన శేషమాంబ, బెవర బాపూజీ, గద్దెపిల్లి చిన్నప్పన్న, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు పోతిన నాయుడుబాబు, వరిపిల్లి శంకర్, వి.విమల, బొంతు శ్రీనివాసరావు, ప్రస్తుత పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ బుడుమూరి మీనా తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పూర్వ విద్యార్థినుల కలయిక

భీమునిపట్నం: భీమిలిలోని సెయింట్ ఆన్స్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థినులు ఉత్సాహంగా కలుసుకున్నారు. ఇక్కడ 1995 – 96 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థినులు 27 సంవత్సరాల తర్వాత కలుసుకున్నారు. అనేక ప్రాంతాల్లో స్థిరపడిన వీరంతా తమ కుటుంబాలతో కలుసుకుని ఆ పాత మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారికి విద్య నేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు. సాయంత్రం వరకు ఆటపాటలతో గడిపారు. రమాదేవి, బంగారుపాప, సింధూర, పద్మావతి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.


సెయింట్ ఆన్స్ పాఠశాలలో పూర్వ విద్యార్థినులు

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన

పీఎం పాలెం: వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం శిల్పారామం (జాతర)లో ప్రదర్శించిన కూచిపూడి నృత్యం విశేషంగా ఆకట్టుకుంది. నగరంలోని సిరి డ్యాన్స్ అకాడమీలో నృత్య శిక్షణ పొందుతున్న విద్యార్థులు నృత్య విన్యాసాలు ప్రదర్శించి ప్రేక్షకుల మన్ననలు అందుకున్నారు. కళాకారులు శరణ్య, రియా, హరిత, కుందన, వర్షిత, భావన, వర్షిణి, ఝాన్సీ, రేవతి, సిరి, దివ్య, భార్గవి, మోనిక, నాగలక్ష్మి నృత్యం చేయగా స్వర్ణ నాగలక్ష్మి నృత్య దర్శకత్వం వహించారు. స్థానిక పరిపాలన అధికారి టి.విశ్వనాథరెడ్డి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.


శిల్పారామంలో నృత్యం చేస్తున్న కళాకారులు

కల్వర్ట్ కింద నుంచి మంటలు


కల్వర్ట్ నుంచి వ్యాపిస్తున్న పొగ, మంటలు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు రుషికొండ వద్ద ఓ కల్వర్ట్ కింద నుంచి భారీగా పొగ, మంటలు వ్యాపించాయి. వివరాల్లోకి వెళ్తే... ఇక్కడి కల్వర్టు కింద నుంచి భూగర్భ విద్యుత్ లైన్ ఉంది. ఆదివారం ఉదయం ఇక్కడి నుంచి ఒక్కసారిగా భారీగా పొగ, తర్వాత మంటలు వ్యాపించాయి. స్థానికులు వెళ్లి చూసేసరికి అక్కడున్న భూగర్భ విద్యుత్ లైన్లకు షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించినట్లు తెలుసుకుని విద్యుత్‌శాఖ అధికారులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వెంటనే వారు అక్కడకు చేరుకుని మంటలు అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఘటనలో ఎవరికీ ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

రూ.20 లక్షలతో చురుగ్గా అభివృద్ధి పనులు


శ్రీనివాసనగర్ వద్ద నిర్మిస్తున్న కల్వర్టు


బాపూజీనగర్ వెళ్లే మార్గం వైపు సిద్ధమవుతున్న కల్వర్టు

మధురవాడ: జీవీఎంసీ 7వ వార్డులో నగరంపాలెం మాస్టర్ ప్లాన్ రోడ్డు – స్వతంత్రనగర్ లే అవుట్‌లోని స్వతంత్రనగర్, శ్రీనివాసనగర్, బాపూజీ నగర్ తదితర ప్రాంతాలకు కనెక్టింగ్ కల్వర్టు పనులు చకచకా జరుగుతున్నాయి. దశాబ్దాల తరబడి పనులు జరగక పక్కనే మాస్టర్ ప్లాన్ రోడ్డు ఉన్నా గెడ్డ అడ్డంగా ఉండడం, కనెక్టివిటీ కల్వర్టు లేకపోవడంతో రాకపోకలు సాగించలేని పరిస్థితి ఉండేది. దీంతో ఈ కాలనీల వాసులు ఎన్నో అవస్థలు పడుతుండేవారు. ఈ పెండింగ్ పనుల పూర్తికి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో రూ.20 లక్షల నిధులు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మంజూరు చేయించారు. వీటితో 3 కల్వర్టులు, రిటైనింగ్ వాల్, అప్రోచ్ రోడ్డు పనులు చేపడుతున్నారు. పనులు ప్రారంభం కావడం, చకచకా జరుగుతుండడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఏడు పంచాయతీల్లో 'నా భూమి - నా దేశం' కార్యక్రమాలు నేడు

పద్మనాభం: మండలంలోని ఏడు పంచాయతీల్లో సోమవారం 'నా భూమి – నా దేశం' కార్యక్రమాలు జరుగుతాయని ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మద్ది, విలాస్కాన్‌పాలెం, కృష్ణాపురం, పాండ్రంగి, తునివలస, నేరెళ్లవలస, చిన్నాపురం పంచాయతీల్లో ఈ కార్యక్రమాలు జరుగుతాయని ఆయన తెలిపారు.

జ్యూట్‌మిల్లు పరిసరాలే మందుబాబులకు అడ్డా

గంజాయి, మద్యం సేవిస్తూ రెచ్చిపోతున్న జులాయిలు

తగరపువలస: మందుబాబులు శిథిలమైన చిట్టివలస జ్యూట్‌మిల్లు పరిసరాలను అడ్డాగా చేసుకుని రెచ్చిపోతున్నారు. నిర్మానుష్యంగా ఉన్న ప్రదేశాలను మద్యపానం, గంజాయి సేవనానికి వినియోగిస్తున్నారు. దీంతో ఉదయం 11 గంటల నుంచి చీకటి పడేంత వరకు ఈ ప్రాంతం అరుపులు, కేకలతో దద్దరిల్లిపోతోందని ఈ మార్గం ద్వారా వెళ్లేవారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొందరైతే మితిమీరి దాడులకు కూడా పాల్పడుతున్నారని వాపోతున్నారు. భీమిలి పోలీస్ స్టేషన్‌కు ఇటీవల బదిలీపై వచ్చిన సీఐ డి.రమేష్ బహిరంగ మద్యపానంపై ఉక్కుపాదం మోపారు. మద్యపాన దుకాణాల వద్ద హెచ్చరిక పోస్టర్లు అంటించడమే కాకుండా పాన్‌షాపుల వద్ద బెల్టు దుకాణాలు నిర్వహించకూడదని, మద్యపానం చేసేవారికి గ్లాసులు తదితర వస్తువులు విక్రయించకూడదని హెచ్చరికలు జారీ చేశారు. దీంతో మందుబాబులంతా కొద్ది రోజులుగా జ్యూట్‌మిల్లు పరిసరాలకు చేరుతున్నారు.


జ్యూట్‌మిల్లు గోడను ఆనుకుని ఓల్డ్ పోలీస్ అవుట్ పోస్ట్ ప్రదేశం

ఓల్డ్ అవుట్‌పోస్ట్, చిన్న బంగ్లాలే అడ్డా...

చిట్టివలస జ్యూట్‌మిల్లు రామాలయం తర్వాత ఓల్డ్ అవుట్‌పోస్ట్, సిబ్బంది క్వార్టర్స్, అధికారులు నివసించే చిన్న బంగ్లాను ఆకతాయిలు అడ్డాగా మార్చుకున్నారు. ఆటోలు, ద్విచక్ర వాహనాలపై వచ్చి నిర్మానుష్యమైన ఈ ప్రాంతంలో చెట్ల కింద గంటల తరబడి మకాం వేసి మద్యం, గంజాయి వంటి మత్తు పదార్థాలు సేవిస్తున్నారు. దీంతో ఈ నిర్మానుష్యమైన ప్రాంతమంతా మద్యం సీసాలు, ఇతర వ్యర్థాలతో నిండిపోయింది. మద్యం మత్తులో వీరి చేష్టలకు జడిసి జ్యూట్‌మిల్లు రహదారిపై ఒంటరిగా వెళ్లేవారు పలు ఇబ్బందులకు గురవుతున్నారు. చీకటి పడిన తర్వాత మిల్లు రామాలయాన్ని ఆనుకుని ఉన్న లే అవుట్‌లో కూడా జులాయిలు విచ్చలవిడిగా తిష్ట వేస్తున్నారు. లే అవుట్‌లో విద్యుత్ దీపాలను సైతం ఆర్పివేసి చీకటి కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. ఈ ప్రాంతాల్లో పోలీసులు నిఘా పెట్టి ఆకతాయిల ఆగడాలకు చెక్ పెట్టాలని చిట్టివలస ప్రజలు కోరుతున్నారు.

అవయవదానాన్ని ఆరోగ్యశ్రీలో చేర్చాలి


మాట్లాడుతున్న గూడూరు సీతామహాలక్ష్మి

సీతంపేట: పేదలకు ఉపయోగపడేలా అవయవ మార్పిడి శస్త్రచికిత్సలను ఆరోగ్యశ్రీ పథకంలో చేర్చాలని సావిత్రిభాయి పూలే ఎడ్యుకేషన్ చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ గూడూరు సీతామహాలక్ష్మి కోరారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం జరిగిన ప్రపంచ అవయవదాన వారోత్సవాల ముగింపు సభలో ఆమె మాట్లాడారు. కేజీహెచ్ వంటి ప్రభుత్వ ఆస్పత్రుల్లో అవయవ మార్పిడి ఆపరేషన్ల కోసం ప్రత్యేక యూనిట్ ఏర్పాటు చేయాలని, దానికి అవసరమైన మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పించాలన్నారు. అవయవదానం చేసిన వారి పిల్లలకు ప్రోత్సాహకంగా ఉచిత విద్య, కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలని సూచించారు. ఉన్నత విద్యా సిలబస్‌లో అవయవదానాన్ని పాఠ్యాంశంగా చేర్చాలని, ఈ విషయాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. స్టీల్‌ప్లాంట్ సీవీవో ఎస్.కరుణరాజు మాట్లాడుతూ అవయవదానంతో ఎంతో మందికి పునర్జన్మనిస్తున్న వారంతా దేవుళ్లతో సమానమన్నారు. అటువంటి కార్యాన్ని పెద్ద ఎత్తున చేస్తున్న గూడూరు మహాలక్ష్మి సేవలను అభినందించారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద మాట్లాడుతూ బ్రెయిన్‌డెడ్ అయిన వారు అవయవదానం చేయడం వల్ల వారి నుంచి సేకరించిన గుండె, కాలేయం, మూత్రపిండాలు, ఊపిరితిత్తులు, ప్రేగులు, ఎముకలు, మూలుగ, కళ్లు మరణానికి చేరువైన వారికి అమర్చడం ద్వారా వారికి జీవితాన్ని ప్రసాదించవచ్చని పేర్కొన్నారు. అవయవదానానికి ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా శరీరదాతలకు అభినందన పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, ఏఎంసీ ప్రొఫెసర్ వి.పద్మజ, అనకాపల్లి డీటీవో వి.ఎల్.సుభాషిణి, ట్రస్టు కార్యదర్శి ఎస్.బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళాలు

పరవాడ: గొల్లపేటలో శ్రీ కృష్ణాలయ నిర్మాణానికి పలువురు ఆదివారం విరాళాలు అందజేశారు. జెడ్పీటీసీ సభ్యుడు పైల సన్యాసిరాజు రూ.10 వేలు, ఉత్తరాంధ్ర జిల్లాల బీసీ సంక్షేమ సంఘ చైర్మన్ కూండ్రపు కృష్ణంనాయుడు రూ.3016 అందించారు.

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో ఎర్నిమాంబ అమ్మవారు

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పరిధి కాన్వెంటు కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం అధిక శ్రావణ మాస శుద్ధ ద్వాదశి ఆదివారాన్ని పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడింది. ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలకంరించారు. ఆలయ ప్రధాన అర్చకులు పులఖండం శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలు ఏర్పాటు చేశారు. ఆలయ పరిసరాల్లో భక్తులు వంటా వార్పు చేసుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా, ఆలయ సిబ్బంది రామకృష్ణ, ప్రసాద్ తదితరులు భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో రుద్రాభిషేకం


సాయి మందిరంలో రుద్రాభిషేకం చేస్తున్న భక్తులు

మధురవాడ: భగవాన్ శ్రీ సత్య సాయిబాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా విశ్వశాంతిని కాంక్షిస్తూ మధురవాడ మిథిలాపురి వుడా కాలనీలో నమామి సాయి శత రుద్రయాగం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. రాష్ట్ర సమన్వయకర్త డాక్టర్ సాయి శ్రీహరి ప్రసాద్ శర్మ వేదాధ్యయన విభాగం నిర్వహణలో 49వ మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం వుడా కాలనీ రోడ్డులో గల ఓ ఫంక్షన్ హాలులో నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాలు హరి హర మహాదేవ, సాయి నామాలతో ప్రతిధ్వనించాయి. ఉదయం నగర సంకీర్తన, శోభాయాత్రతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఉమ్మడి విశాఖ జిల్లాల నుంచి సుమారు వెయ్యి మందికి పైగా సాయి భక్తులు విశేషంగా హాజరై తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు.

విద్యార్థి అదృశ్యం


ప్రేమ్‌చంద్

ఆనందపురం : మండలంలోని బోయిపాలెంలో ఉన్న ఓ ప్రైవేట్ కళాశాల విద్యార్థి అదృశ్యమైనట్టు ఫిర్యాదు అందిందని ఏఎస్‌ఐ నూకరాజు ఆదివారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. విజయనగరం జిల్లా, గరుగుబిల్లి మండలం, నాగూరు గ్రామానికి చెందిన విడియాల ప్రేమ్‌చంద్(16) బోయిపాలెంలోని ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. సెలవుల అనంతరం ఈ నెల 2న కళాశాలకు వచ్చి తిరిగి 3న టీసీ తీసుకురావడానికి ఇంటికి వెళ్లాడు. అలా వెళ్లిన ప్రేమ్‌చంద్ తిరిగి 8న కళాశాలకు వచ్చి రెండు రోజుల పాటు ఉన్నాడు. ఈ నెల 11న ఉదయం నుంచి ప్రేమ్‌చంద్ కనిపించకపోవడంతో వైస్ ప్రిన్సిపాల్ మండల త్రినాథ్ ముందుగా తల్లిదండ్రులకు సమాచారం అందించారు. ఎక్కడా ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఏఎస్‌ఐ నూకరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రకృతి వ్యవసాయంతో రైతులకు మేలు


ఇంగువ ద్రావణం తయారీపై అవగాహన కల్పిస్తున్న హేమసుందర్

పద్మనాభం: రైతులంతా ప్రకృతి వ్యవసాయం చేస్తే ప్రయోజనం చేకూరుతుందని రీజినల్ అధికారి హేమసుందర్ సూచించారు. వరి సాగు చేసే రైతులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై మండలంలోని కోరాడలో ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హేమసుందర్ మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల్లో పేడ, మూత్రం, ఇంగువతో తయారు చేసిన ద్రావణాన్ని వరి నారుపై పిచికారీ చేయడం వల్ల సూక్ష్మ పోషకాల లోపాలు, అన్ని రకాల తెగుళ్ల నివారించవచ్చన్నారు. అనంతరం పేడ, మూత్రం, ఇంగువతో ద్రావణం తయారీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా ప్రకృతి వ్యవసాయం ఫార్మింగ్ అసోసియేట్ చక్రవర్తి, జయరాం, కాంతారావు పాల్గొన్నారు.

పడకేసిన రక్షిత మంచినీటి పథకం


నిరుపయోగంగా మారిన పథకం


తుప్పు పట్టి శిథిలమవుతున్న పరికరాలు

తగరపువలస: సంగివలస ముగ్గురు అమ్మవార్ల ఆలయంలో భక్తుల దాహార్తిని తీర్చేందుకు మూడేళ్ల క్రితం దివీస్ లేబొరేటరీ ఏర్పాటు చేసిన రక్షిత మంచినీటి పథకం భక్తులకు ఉపయోగపడకుండానే మూలకు చేరింది. ఇక్కడ ఏర్పాటు చేసిన పరికరాలు తుప్పు పట్టి శిథిలమవుతున్నాయి. దీంతో ఆలయం లోపల వేరే దాతలు ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంటే దిక్కుగా మారింది. ఇతర ప్రాంతాల భక్తులు మొక్కులు చెల్లించుకునే క్రమంలో ఆలయ ఆవరణలో భోజనాలు ఏర్పాటు చేసుకోవడం, ఏటా శరన్నవరాత్రి, వార్షిక ఉత్సవాలు నిర్వహించేటప్పుడు భారీ ఎత్తున అన్నప్రసాదాల పంపిణీ ఇక్కడ జరుగుతుంది. ఏడాదిలో మిగిలిన పుణ్య రోజుల్లో భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. దీంతో ఇక్కడకు వచ్చే భక్తుల తాగునీటి అవసరాలు తీర్చేందుకు రక్షిత మంచినీటి పథకం అవసరం ఉంది. ప్రతీచోటా దివీస్ రక్షిత మంచినీటి పథకాలు ఏర్పాటు చేసి నిర్వహణ గాలికి వదిలేస్తోందని... భక్తుల కష్టాలను దృష్టిలో పెట్టుకుని దీనిని వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

చలనచిత్రాల నిర్మాణానికి ప్రభుత్వ సహకారం


సభ్యులకు నియామక పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ వంశీకృష్ణ యాదవ్

సీతంపేట: ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఏపీ జూనియర్ ఆర్టిస్ట్ యూనియన్, డ్యాన్స్ డైరెక్టర్స్ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం జరిగింది. ముఖ్య అతిథి ఎస్‌వీకే సినిమా నిర్మాత, ఎమ్మెల్సీ వంశీకృష్ణ యాదవ్ సభ్యులకు నియామక పత్రాలు అందించారు. అనంతరం 500 మంది పేద కళాకారులకు బియ్యం, నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి అందాలకు నిలయమైన విశాఖ నగరంలో చలనచిత్రాలు నిర్మించేందుకు ప్రభుత్వం ఎంతో సహకారం అందిస్తుందన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఫిల్మ్ ఇండస్ట్రీ విశాఖ తరలి రావడానికి పలు సదుపాయాలు కల్పించడానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్ అధ్యక్షులు రాజా, రామారావు, రమేష్, నాగేంద్రమ్మ, నిర్మల భాను, విజయరమణి, శివ, మేరీ, సూర్య, ఏపీ టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్, వైఎస్సార్‌సీపీ సాంస్కృతిక విభాగం అధ్యక్షురాలు రాధ, ఏపీ టెక్ మెంబర్ సుశీల పాల్గొన్నారు.

అష్టలక్ష్మి అమ్మవార్లకు విశేష హారతి


హారతి సమర్పిస్తున్న సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి, మాతా రమ్యానంద భారతి

సీతంపేట: లలితానగర్ లలితా పీఠంలో జరుగుతున్న అష్టపద్మ కుండాత్మక అష్టలక్ష్మీ మహాయాగంలో భాగంగా ఆదివారం సాయంత్రం అష్టలక్ష్మీ వైభవం అత్యంత ఘనంగా నిర్వహించారు. కుర్తాళ పీఠం ఆస్థాన పండితులు మాచవోలు రమేష్‌శర్మ వేద మంత్రాలతో అష్టలక్ష్మీ అమ్మవార్లకు విశేష అర్చన, దర్బారు సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా లలితా పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి అష్టలక్ష్మీ అమ్మవార్లకు హారతి సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాలక్ష్మికి అత్యంత ప్రీతిపాత్రమైన శ్రావణ మాసం అధిక మాసంగా వచ్చిందన్నారు. అధిక మాసంలో పూజ, జప, హోమాలూ చేస్తే అధికమైన సత్ఫలితాలు వస్తాయని శ్రీమహావిష్ణువు అధిక మాస ప్రాశస్త్యంలో చెప్పారని పేర్కొన్నారు. కార్యక్రమంలో శక్తి పీఠాధీశ్వరి మాతా రమ్యానంద భారతి స్వామిని పాల్గొన్నారు. పీఠం మేనేజర్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.